## యోధాస్‌కు చుక్కెదురు

కటక్: అల్టిమేట్ ఖో ఖో లీగ్‌లో తెలుగు యోధాస్‌కు చుక్కెదురైంది. లీగ్‌లో ఇప్పటికే సెమీఫైనల్ బెర్తు దక్కించుకున్న తమ ఆఖరి మ్యాచ్‌లో యోధాస్ 22-42 తేడాతో గుజరాత్ జెయింట్స్ చేతిలో ఘోరంగా ఓటమిపాలైంది. సోమవారం జరిగిన మ్యాచ్‌లో గుజరాత్..యోధాస్‌పై పూర్తి ఆధిపత్యం ప్రదర్శించింది. గుజరాత్ తరఫున ఆర్నవ్ పట్నాకర్, సుబ్రమణి పదేసి పాయింట్లతో జట్టు విజయంలో కీలకమయ్యారు.

## టెస్టులకు క్లాసెన్ వీడ్కోలు

ప్రిటోరియా: దక్షిణాఫ్రికా వికెట్ కీపర్ బ్యాటర్ హెన్రిచ్ క్లాసెన్ సుదీర్ఘ ఫార్మాట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాడు. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో దంచికొట్టే క్లాసెన్.. టెస్టుల్లో పెద్దగా ప్రభావం చూపలేకపోయాడు. 2019లో భారత్‌పై టెస్టు అరంగేట్రం చేసిన 32 ఏండ్ల క్లాసెన్ దక్షిణాఫ్రికా జాతీయ జట్టు తరఫున 4 టెస్టుల్లో 104 పరుగులు చేశాడు. వన్డే, టీ20లపై మరింత దృష్టి పెట్టేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు క్లాసెన్ సోమవారం వెల్లడించాడు.

## జింబాబ్వేపై లంక విజయం

కొలంబో: చివరి వరకు నువ్వా నేనా అన్నట్లు సాగిన పోరులో జింబాబ్వేపై శ్రీలంక రెండు వికెట్ల తేడాతో విజయం సాధించింది. మంగళవారం రెండో వన్డేలో మొదట జింబాబ్వే 44.4 ఓవర్లలో 208 పరుగులు చేసింది. కెప్టెన్ ఇర్విన్ (82) టాప్ స్కోరర్. అనంతరం లక్ష్యఛేదనలో శ్రీలంక 49 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 211 పరుగులు చేసింది.

# ఇషా సింగ్‌కు పారిస్ బెర్తు

### సత్తాచాటిన తెలంగాణ యువ షూటర్

### ఏషియన్ క్వాలిఫయర్స్ టోర్నీలో పసిడి ధమాకా

### వరుణ్ తోమర్‌కూ ఒలింపిక్ కోటా

**తెలంగాణ యువ షూటర్ ఇషాసింగ్ మరోమారు తళుక్కుమంది. ఇప్పటికే లెక్కకు మిక్కిలి పతకాలు సాధించిన ఇషా.. ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్‌కు బెర్తు దక్కించుకుంది. సహచర షూటర్ల నుంచి పోటీని దీటుగా ఎదుర్కొన్న ఇషా.. కెరీర్‌లో తొలిసారి విశ్వక్రీడలకు అర్హత సాధించింది. ఏషియన్ క్వాలిఫయర్స్ టోర్నీలో పసిడి పతకం ద్వారా తన కల నెరవేర్చుకుంది. అదే జోరుతో టీమ్‌ఈవెంట్‌లోనూ పసిడి వెలుగులు విరజిమ్మింది. ఇషాకు తోడు వరుణ్ ఒలింపిక్స్ కోటా దక్కించుకున్నాడు.**

జకార్తా: తెలంగాణ స్టార్ షూటర్ ఇషా సింగ్..రానున్న పారిస్ ఒలింపిక్స్‌కు టిక్కెట్ ఖాయం చేసుకుంది. పలు ప్రతిష్ఠాత్మక టోర్నీల్లో పతకాలు సాధించడం ద్వారా యుక్త వయసులోనే దేశ వ్యాప్తంగా తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఇషాసింగ్..తన కెరీర్‌లో తొలిసారి విశ్వక్రీడలకు అర్హత సాధించి ఔరా అనిపించింది. ఏషియన్ క్వాలిఫయర్స్ టోర్నీలో భాగంగా సోమవారం జరిగిన మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్ ఫైనల్లో ఈ హైదరాబాదీ షూటర్ పసిడి పతకంతో మెరిసింది. ఆద్యంతం హోరాహోరీగా సాగిన తుది పోరులో ఇషాసింగ్(243.1) అగ్రస్థానంతో స్వర్ణం దక్కించుకోగా, కిష్మాల తలాత్(236.3, పాకిస్థాన్), రితమ్ సాంగ్వాన్(214.5) వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు. ఆది నుంచే తనదైన జోరు కనబరిచిన ఇషా..చెక్కుచెదరని గురితో ఆకట్టుకుంది. రౌండ్ రౌండ్‌కు తన ఆధిక్యాన్ని అంతకంతకూ పెంచుకుంటూ పోయిన ఈ 19 ఏండ్ల షూటర్ అనుకున్న ఫలితాన్ని సాధించింది. ప్రత్యర్థి షూటర్ల నుంచి దీటైన పోటీ ఎదురైనా పసిడి పతకాన్ని తన ఖాతాలో వేసుకుంది. అదే జోరు కొనసాగిస్తూ టీమ్‌ఈవెంట్‌లో రిథమ్, సురభి రావుతో కలిసి 1736 స్కోరుతో ఇషాసింగ్ మరో పసిడి పతకం దక్కించుకుంది. పురుషుల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో వరుణ్ తోమర్(239.6) స్వర్ణ పతకాన్ని ముద్దాడి పారిస్ బెర్తు ఖరారు చేసుకున్నాడు. ఇదే విభాగంలో భారత్‌కు చెందిన అర్జున్‌సింగ్(237.3), దవక్షు(217.2) వరుసగా రజత, కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. తోమర్, చీమా, ఉజ్వల్ మాలిక్‌తో కూడిన భారత త్రయం 1740 స్కోరుతో 10మీటర్ల పిస్టల్ టీమ్ ఈవెంట్‌లో స్వర్ణం దక్కించుకుంది. ఇదే విభాగంలో ఇరాన్‌కు రజతం, కొరియాకు కాంస్యం లభించాయి. ఇషాసింగ్, వరుణ్‌తోమర్ ద్వారా పారిస్ ఒలింపిక్స్ షూటింగ్‌లో భారత్ బెర్తుల సంఖ్య 15కు చేరుకోవడం విశేషం. ఇది టోక్యో(2020) అర్హతకు సమానంగా నిలిచింది. టోర్నీలో మరికొన్ని పోటీలు మిగిలున్న నేపథ్యంలో బెర్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 10మీటర్లతో పాటు 25 మీటర్ల విభాగంలోనూ ఇషాసింగ్ బెర్తు దక్కించుకునే చాన్స్ ఉందని తండ్రి సచిన్‌సింగ్ ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. పోటీల తొలి రోజైన సోమవారం భారత్ ఖాతాలో నాలుగు స్వర్ణాలు, ఒక రజతం, ఒక కాంస్యంతో అగ్రస్థానంలో కొనసాగుతుండగా, చైనా(4), ఉజ్బెకిస్థాన్(1) ఆ తర్వాత స్థానాల్లో ఉన్నాయి.

> ప్రణాళికబద్ధమైన ట్రైనింగ్, క్రమశిక్షణ..ఇషా సింగ్ విజయవంతం కావడానికి కారణాలు. పారిస్ ఒలింపిక్స్ బెర్తు దక్కించుకోవడం ద్వారా దేశం గర్వపడేలా చేసింది. ఇటీవల ఆసియాగేమ్స్‌లో నాలుగు పతకాలు సాధించి చరిత్ర సృష్టించింది. ఇప్పుడు దానికి కొనసాగింపుగా విశ్వక్రీడలకు అర్హత సాధించింది. 13 ఏండ్ల ప్రాయం నుంచే ఇషా అద్భుతంగా రాణిస్తూ వస్తున్నది. బరిలోకి దిగిన 99శాతం టోర్నీల్లో పతకాలు కొల్లగొట్టింది. **- సచిన్‌సింగ్, ఇషా తండ్రి**

*సికింద్రాబాద్ జింఖానా మైదానం వేదికగా జరుగుతున్న 6వ మాస్టర్స్ గేమ్స్‌లో హైదరాబాద్ అథ్లెట్ శైలజారావు మూడు స్వర్ణ పతకాలు సాధించింది. 100మీ, 5కే వాక్, షాట్‌పుట్ ఈవెంట్లలో శైలజ పసిడి పతకాలతో మెరిసింది. శైలజను రామ్‌రెడ్డి, రామరావు, రాజేంద్రప్రసాద్ అభినందించారు.*

## శివానీకి కాంస్యం

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ఢిల్లీ వేదికగా జరుగుతున్న 67వ జాతీయ స్కూల్‌గేమ్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్రానికి చెందిన యువ స్విమ్మర్ శివానీ కర్రా కాంస్య పతకంతో మెరిసింది. సోమవారం జరిగిన బాలికల అండర్-14 విభాగంలో శివానీ 2:36:64సె కన్న టైమింగ్‌తో మూడో స్థానంలో నిలిచింది. శృతి ఛటర్జీ, అనైకా ప్రవీణ్ వరుసగా స్వర్ణ, రజత పతకాలు సొంతం చేసుకున్నారు. మరోవైపు అండర్-19 బటర్‌ఫ్లై విభాగం ఫైనల్లో యువ స్విమ్మర్ ప్రతి అగర్వాల్(2:26:59సె) పసిడి పతకం దక్కించుకుంది. జెదాహ్, ఇషా ఘోషల్ వరుసగా రజత, కాంస్య పతకాలు కైవసం చేసుకున్నారు.

## తెలంగాణ, ఉత్తరాఖండ్ పోరు సమం

- **జాతీయస్థాయి కబడ్డీ పోటీలు**

కామారెడ్డి, జనవరి 8 :జిల్లా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జాతీయ స్థాయి అండర్- 17 బాలుర కబడ్డీ పోటీలు హోరాహోరీగా సాగుతున్నాయి. సోమవారం ఆతిథ్య తెలంగాణ, ఉత్తరాఖండ్ మధ్య జరిగిన పోరు టై గా ముగిసింది. ఆద్యంతం నువ్వానేనా అన్నట్లు సాగిన మ్యాచ్‌లో ఇరు జట్ల స్కోరు సమమైంది. మరోవైపు కేరళపై ఉత్తరప్రదేశ్ 12 పాయింట్లతో, హిమాచల్‌ప్రదేశ్‌పై కర్ణాటక 8 పాయింట్లతో, కేంద్రీయ విద్యాలయంపై ఢిల్లీ 14 పాయింట్లతో, పంజాబ్‌పై 28పాయింట్లతో బీహార్, కేంద్రీయ విద్యాలయంపై 11 పాయింట్లతో ఒడిశా, జార్ఖండ్‌పై 63 పాయింట్లతో మహారాష్ట్ర, పాండిచ్చేరిపై 21 పాయింట్లతో తమిళనాడు విజయాలు సాధించాయి. ఈ నెల 11వ తేదీ వరకు పోటీలు కొనసాగనున్నాయి.

## చరిత్ర సృష్టించేనా!

### నేడు, భారత్, ఆస్ట్రేలియా మహిళల మూడో టీ20

ముంబై: ఆస్ట్రేలియాపై తొలి టీ20 సిరీస్ గెలించేందుకు భారత మహిళల జట్టు సిద్ధమైంది. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో ఇరు జట్లు చెరో విజయం సాధించగా.. మంగళవారం నిర్ణయాత్మక ఫైనల్ జరగనుంది. తొలి మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో అదరగొట్టి కంగారూలను చిత్తుచేసిన హర్మన్‌ప్రీత్ బృందం.. రెండో మ్యాచ్‌లో అదే జోరు కొనసాగించలేకపోయింది. తాజా సీజన్‌లో టెస్టు విజయాలు సాధించడంతో పాటు.. వన్డేల్లో కాస్త పోరాడిన టీమ్‌ఇండియా.. ఆసీస్‌పై టీ20 సిరీస్ చేజిక్కించుకోవాలని పట్టుదలతో ఉంది. గతంతో పోల్చుకుంటే.. ఫీల్డింగ్, బౌలింగ్‌లో మన అమ్మాయిలు మెరుగ్గా కనిపిస్తున్నా.. ఆరుసార్లు ప్రపంచ చాంపియన్ ఆస్ట్రేలియాను నిలువరించాలంటే అన్ని రంగాల్లో రాణించాల్సి ఉంటుంది. ముఖ్యంగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌పై ఒత్తిడి అధికంగా ఉంది. గత కొన్ని మ్యాచ్‌లుగా స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతున్న హర్మన్ ఈ మ్యాచ్‌లోనైనా విజృంభిస్తుందా చూడాలి.

## నేటి నుంచి మలేషియా ఓపెన్

కౌలాలంపూర్: భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్లు నయా సీజన్‌కు సిద్ధమయ్యారు. ఈ ఏడాది ప్రతిష్ఠాత్మక పారిస్ ఒలింపిక్స్ జరగనున్న నేపథ్యంలో హెచ్ఎస్ ప్రణయ్, లక్ష్యసేన్, కిడాంబి శ్రీకాంత్, సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి.. మంగళవారం నుంచి ప్రారంభం కానున్న మలేషియా ఓపెన్‌లో బరిలోకి దిగనున్నారు. బీడబ్ల్యూఎఫ్ వరల్డ్ టూర్ సూపర్ 1000 టోర్నీలో సీనియర్లతో పాటు యువ ఆటగాళ్లు కూడా తమ అదృష్టాన్ని పరీక్షించుకోనున్నారు. మహిళల విభాగంలో గాయత్రి గోపీచంద్, త్రిసా జాలీ, అశ్విని పొన్నప్ప, తనీషా పోటీ పడుతున్నారు. గాయం నుంచి పూర్తిగా కోలుకోని స్టార్ షట్లర్ పీవీ సింధు ఈ టోర్నీలో ఆడటం లేదు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.